పరిశుభ్రతతోనే డయేరియా నివారణ

- పకడ్బందీగా ఎల్‌సీడీసీ సర్వే
- చిన్నారులకు ఓఆర్‌ఎస్‌లు పంపిణీ చేయాలి
- గ్రామాల్లో డయేరియాపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



రామాపురం: గర్భిణులకు శ్రీమంతం చేస్తున్న పీడీ శశికళ

రాయచోటి అర్బన్ : ఇంటి పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతతోనే డయేరియాను పూర్తిస్థాయిలో నివారించవచ్చని డీపీఎంఓ రియాజ్‌బేగ్, డీఎస్‌ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డిలు అన్నారు. సుండుపల్లె, జికె రాచపల్లె ఆరోగ్య కేంద్రాలలో మంగళవారం నిర్వహించిన ఆశ డే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాల పిల్లల గృహ సర్వేలతోపాటు ఓఆర్‌ఎస్ క్యాంపెయిన్‌లను నిర్వహించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామాల్లో డయేరియా వ్యాధి వ్యాప్తి, నివారణల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామాల్లో వీలైనంత మేర ఎక్కువగా ఓఆర్‌ఎస్ కార్నర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జూలై 17 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఎల్‌సీడీసీ సర్వేను చేయాలన్నారు. మగవారికి మగ వలంటరీల చేత, ఆడవారికి ఆశ కార్యకర్తల చేత పరీక్షలు నిర్వహింపచేసి రిపోర్టు నమోదు చేయాలన్నారు. లెప్రసీ సర్వేలో ఒకొక్క ఆశ కార్యకర్త కనీసం 10 మంది సస్పెక్ట్‌లను గుర్తించాలని, చర్మం మీద పొడలు, చర్మం ఎక్కువగా మెరుస్తూ ఉండడం, అరికాళ్లు, అరచేతలు స్పర్శలేకుండా పోవడం, వేసుకున్న చెప్పులు జారిపోవడం, చల్లటి, వేడినీటిని గుర్తించలేకపోవడం లాంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి పీహెచ్‌సీలకు పంపాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్వేత, హసన్‌అలీతోపాటు సీహెచ్‌ఓ, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే డెంగ్యూ నివారణ సాధ్యం

అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగుల సమష్టి కృషితోనే డెంగ్యూ వ్యాధి నివారణ సాధ్యమని యండపల్లె పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతి, సబ్‌యూనిట్ అధికారులు ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, వెంకటేశ్వరరెడ్డిలు అన్నారు. మంగళవారం యండపల్లె పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని వారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తీవ్రజ్వరం, తల నొప్పి, కీళ్ల, కండరాల నొప్పులు, వికారం, చర్మంపై దద్దుర్లు, అలసట తదితర లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే ప్రభుత్వ వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. డెంగ్యూ వ్యాధినివారణకు ప్రధానంగా దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమణమ్మ, విశ్వనాతరెడ్డి, దేవేంద్ర, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో డయేరియాపై అవగాహన

రామాపురం : ఈనెల 1 నుండి 31వ తేదీ వరకు గ్రామాల్లోని తల్లులకు, ప్రజలకు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు డయేరియాపై అవగాహన కల్పించాలని అన్నమయ్య జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శశికళ అన్నారు. మంగళవారం మండలంలోని చిట్లూరు సెక్టార్ పరిధిలోని పక్కీరుపల్లెలో సామూహిక శ్రీమంతం, అక్షరాభ్యాసం కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజన్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. పిల్లలకు అక్షరాభ్యాసం, శ్రీమంతం, గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం మంచి పద్ధతి అన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సీడీపీఓ మండల సూపర్‌వైజర్లు సుజాత, పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

డయేరియాను శుభ్రత, ఓఆర్‌ఎస్‌తో నివారిద్దాం

సుండుపల్లె : ఆశ అజెండాలో భాగంగా 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు గల గృహ సర్వేలు నిర్వహించాలని డాక్టర్ రియాజ్ బేగ్, డీఎస్‌ఎంఓ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డిలు ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలను కోరారు. ఆశ డే కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రామాలలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు ఎంఎల్‌హెచ్‌పీలు స్టాప్ డయేరియా గురించి ఓఆర్‌ఎస్, జింక్ టాబ్లెట్స్ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఓఆర్‌ఎస్ కార్నర్స్ ఎక్కువ సంఖ్యలో పెట్టాలని, గ్రామాలలో ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, బాలింత సంరక్షణను పాటించాలని, సురక్షితమైన ఆహారం, మంచినీరు బిడ్డలకు ఇవ్వాలని, పాలిచ్చే తల్లుల ఆవశ్యకతను గురించి వివరించారు. అనంతరం డయేరియా నియంత్రణ కార్యక్రమం బ్యానర్స్, పోస్టర్స్, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్వేత, డాక్టర్ హసన్ అలీ, సీహెచ్‌ఓ, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు : అతిసార వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ వైద్యులు శరత్ కమల్, కార్తీక్ విశ్వనాథ్‌లు పేర్కొన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిల్లల్లో అతిసార వ్యాధి నివారించుటకు ప్రతి ఐదు సంవత్సరాల పిల్లల ఇంటిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అతిసార వ్యాధి సోకిన పిల్లలకు జింక్ టాబ్లెట్లు 14 రోజులు వేసుకోవాలన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లల తల్లిదండ్రులకు గ్రూపు మీటింగ్‌లు నిర్వహించి వారికి అవగాహన కల్పించాలన్నారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆశా కార్యకర్తలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు ఆదేశించారు. ఈ సమావేశంలో సీహెచ్‌ఓ వెంకటనారాయణ, పీహెచ్‌ఎన్ శైలజ, సూపర్‌వైజర్లు సునీల్ తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి అర్బన్: జంగంరెడ్డిగారిపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సుండుపల్లె: డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

క్లుప్తంగా

కూటమి ప్రభుత్వానికి జగన్ పాలనే ఆదర్శం



మిర్యాల సురేఖ

రాజంపేట టౌన్ : జగన్ సీఎం కాక ముందు వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు పింఛన్ తీసుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారని, అయితే 2019వ సంవత్సరంలో జగన్ సీఎం అయ్యాక ఆయన లబ్ధిదారులకు తమ ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా కన్వీనర్ మిర్యాల సురేఖ తెలిపారు. ఆమె మంగళవారం ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం జగన్ పాలనను ఆదర్శంగా తీసుకొని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ ఇస్తుండటం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలుగా తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. తమ నాయకుడు వేసిన బాట వల్లే తమ ప్రభుత్వం లేకపోయినప్పటికీ అవ్వతాతలు, దివ్యాంగులు, మహిళలు ఇబ్బందులు లేకుండా పింఛన్ పొందగలుగుతున్నారన్నారు. ఇంటివద్దకే పింఛన్ ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలియజేశారు.

సూచిక బోర్డుల ఏర్పాటు



బోర్డులను ఏర్పాటు చేస్తున్న ఎస్‌ఐ పెద్ద ఓబన్న

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ ప్రధాన రహదారికి పక్కనున్న రోడ్డులకు సూచిక బోర్డులను ఏర్పాటు చేశామని ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు. మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధితో ఎవరైనా సమస్యలపై ఫిర్యాదు చేస్తే రోడ్ నెంబర్ చెప్పే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేశామని చెప్పారు. వైద్య పరీక్షల నిమిత్తం 108 వాహనానికి ఎవరైనా ఫిర్యాదు చేస్తే రోడ్డు నెంబర్ కచ్చితంగా చెప్పాలని ఆయన ప్రజలకు సూచించారు. మాధవరం-1 గ్రామానికి చెందిన జి.సుబ్బరాయుడు, చంద్రల సహకారంతో రహదారులకు సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్టు ఎస్ తెలియజేశారు. గ్రామంలో రాత్రి వేళల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ స్థానికులను కోరారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



నూతనంగా ఎన్నికైన వారిని సన్మానిస్తున్న దృశ్యం

రాయచోటి జగదాంబ సెంటర్ : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యల పరిష్కారానికి యూనియన్ తరపున తమ వంతు కృషి చేస్తామని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం రాయచోటిలో టీఎన్‌యూఎస్ జిల్లా నూతన శాఖను ఎన్నికల పద్ధతిలో గౌరవాధ్యక్షులు సీఆర్‌వీ సుబ్రమణ్యం, జిల్లా కన్వీనర్, ఎలక్షన్ అబ్జర్వర్ వీరాంజనేయులు ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా ఉపాధ్యాయుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షులుగా సంజీవరెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా రామచంద్ర, కోశాధికారిగా సుధాకర్‌లతోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీఎన్‌యూఎస్ సంఘం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయం పాటించాలి



రెడ్డివారిపల్లె పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగరాజు

గాలివీడు : ఉపాధ్యాయుల సమయం పాటించాలని ఎంఈఓ పిల్లి నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని ఈడిగపల్లె, రెడ్డివారిపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా పాఠశాల సమయంలో పాఠశాలలోనే తప్పక విధి నిర్వహణలో ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను, భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు విద్యను బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియజేశారు.

విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి

గాలివీడు : ఆర్‌బీఐ మార్గదర్శకాల అనుసరించి ఇక మీదట ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు వీలు ఉండదని మండల విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై బిల్లులను విద్యుత్ కార్యాలయాల్లో, ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో లేదా శాఖకు సంబంధించిన యాప్‌లో మాత్రమే చెల్లించాలన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

ఐటీఐలో ఖాళీల భర్తీకై దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్ : ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు 24వ తేదీలోపే తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం కౌన్సిలింగ్‌కు పిలవనున్నట్లు తెలిపారు. వివిధ విభాగాలలో 116 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

సుబ్రమణ్యస్వామికి అభిషేక పూజలు



ప్రత్యేక అలంకారంలో సుబ్రమణ్య స్వామి

నందలూరు : రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కన ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో కొలువైన సుబ్రమణ్యస్వామికి మంగళవారం అభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ పూజారి సరసా రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు భక్తి శ్రద్ధలతో అభిషేక కార్యక్రమంలో పాల్గొని వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఇరు వర్గాలపై కేసు

వాల్మీకిపురం: చింతలవారిపల్లి పంచాయతీ బోయపల్లిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గాల మధ్య గత రెండు రోజుల నుంచి ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఇరు వర్గాల ఘర్షణలో మహిళలు కూడా ఉండడం గమనార్హం. మంగళవారం వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోగా.. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ నాగేశ్వర రావు ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిందని, దీంతో కొంత మంది గాయపడ్డారని తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది



రామ్‌గోపాల్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సిద్దవటం : ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని విద్యార్థులను గొప్ప పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ఒక శిల్పిలాంటి వారిని సిద్దవటం ఎంఈఓ విలియంరాజు కొనియాడారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం ముగ్గురి ఉపాధ్యాయులు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ విలియంరాజు మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పనిసరి అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు మాత్రమే ఉత్తమ పౌరులను తయారు చేస్తారన్నారు. రిటైర్డ్ ఎంఈఓ శంకరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూడకూడదన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. కావున తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆయన తెలియజేశారు. వీరపనాయునిపల్లె ఎంఈఓ జాఫర్ సాధిక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు నమ్మకం కలిగించాలన్నారు. కాలానుగుణంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి పనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. చదువుతోపాటు విద్యార్థుల క్రమశిక్షణ పట్ల ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పదవీ విరమణ పొందిన నేకనాపురంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రామ్‌గోపాల్‌రావు, మాధవరం-1 పంచాయతీలోని వెంకటేశ్వరాపురం ఎంపీయూపీ స్కూల్‌లో పనిచేస్తున్న నూర్ మహ్మమద్‌ను, వెలుగుపల్లె పనిచేసిన ఉపాధ్యాయురాలు సౌభాగ్యమ్మలను ఎంఈఓ విలియంరాజు, ఉపాధ్యాయులు, వారి కుటుంబీకులు, బంధువులు స్నేహితులు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 అరుణ, మండలం లోని ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటూ పోరాడతామని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పలు సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, టీడీపీ నాయకులు చేస్తున్న దాడులు, అరాచకాలను అడ్డుకుని కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. అలాగే అభివృద్ధి, సంక్షేమం విషయాలలో పేదలకు అండగా ఉండి పోరాడతామని తెలిపారు. మొదలు పెట్టిన అభివృద్ధి పనులను టీడీపీ ప్రభుత్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలకు అన్ని వేళల అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, నాయకులు పంజం సుకుమార్‌రెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, సుధాకర్ రాజు, సీహెచ్ రమేష్, నందా బాల, రామక్రిష్ణ, రత్తయ్య, శివయ్య, పలు మండలాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె : ఏపీ మోడల్ కాలేజీలో మొదటి ఇంటర్ ప్రవేశంలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ కాలేజీలో ఇంటర్ ఇంగ్లిష్ మీడియంలో ఐపీసీ, ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో మిగిలిన సీట్లకు 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు మోడల్ కాలేజీలో సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

పాఠశాలలో వసతుల కల్పనకు కృషి



పాఠశాలలోని నెలకొన్న సమస్యలను తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

రామాపురం : మండలంలోని ఆదర్శపాఠశాలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ రెడ్డి తనిఖీ చేశారు. ఆదర్శ పాఠశాల ఆవరణలో, వంటగదిని, బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. ప్రిన్సిపాల్ శ్యామలదేవితో కలిసి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వసతిగృహం ఆవరణలో విద్యుత్ దీపాలు రాత్రి సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వసతిగృహం వెనుకవైపు గుట్టప్రాంతం ఉండడంతో రాత్రి సమయంలో విషపురుగులు వసతిగృహం పరిసర ప్రాంతాలలోకి వస్తున్నాయని ఆయనకు తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆయన సొంత నిధులతో విద్యుత్ స్తంభాలను వేయించారు. అనంతరం మాట్లాడుతూ త్వరలో పాఠశాల ఆవరణలో పూర్తిస్థాయిలో విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. పాఠశాలలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్ శ్యామలదేవికి చెప్పారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు శివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆంజనేయునికి పూజలు



పుల్లంపేట : శ్రీ అభయాంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహిస్తున్న దృశ్యం



రైల్వేకోడూరు అర్బన్ : ఆంజనేయస్వామికి పూజలు చేయిస్తున్న భక్తులు

పుల్లంపేట : మండల పరిధిలోని పెరియవరం గ్రామంలో వెలసిన శ్రీ అభయాంజనేయునికి పూజారి శివశర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఆకుపూజ నిర్వహించారు. అలాగే పంచామృతాభిషేకం అర్చనలు చేశారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గాండ్లవీధిలో వెలసివున్న భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా అర్చకులు ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఆకుపూజ, అర్చనలు గావించారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

చిట్వేలి : మండల పరిధిలోని తుమ్మచెట్లపల్లి ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం గతంలో ఈ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు మురళీమోహన్ రాజు 30 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంఈఓలు కోదండనాయుడు, ఈశ్వరయ్యలు ఉపాధ్యాయుడిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, ఖాలేషా, హరి, వెంకటరమణ రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ వద్ద స్తంభిస్తున్న ట్రాఫిక్



మార్కెట్ వద్ద ఆగిపోయిన వాహనాలు

మదనపల్లె సిటీ: టమటా మార్కెట్ వద్ద ట్రాఫిక్ స్తంభించిపోతోంది. వందలాది టమటా వాహనాలు మార్కెట్ నుంచి అమ్మచెరువుమిట్ట వరకు నిలిచిపోయాయి.దీంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారిపోయింది. సాయంత్రం అయితే చాలు వాహనాలు ఎక్కడి ఎక్కడ ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మార్కెట్‌కు టమటా సరుకు ఎక్కువగా వస్తోంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి టమటా వస్తోంది. దీంతో వాహనాలు భారీ రావడంతో రోడ్లపైనే నిలిచిపోతున్నారు. మదనపల్లె పట్టణం నుంచి కదిరి,కడప వైపు వెళ్లే వాహనాలు, వచ్చే వాహనాలు పట్టణంలోకి రాలేకపోతున్నాయి. చౌడేశ్వరి సర్కిల్ వద్ద ఆగిపోతున్నాయి.ఈ విషయంపై మార్కెట్, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలి



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఓబులవారిపల్లె (రైల్వేకోడూరు) : ఓబులవారిపల్లె మండలంలో మంగళవారం పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అలాగే రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఎరువుల దుకాణాదారులకు తెలియజేశారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి వ్యాపార కార్యక్రమాలు నిర్వహించినట్టయితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఎర్రైనా రైతు సోదరులు ఎరువులు, విత్తనాలు సబ్సిడీ ప్రమాణాలపై అనుమానం ఉంటే రైల్వేకోడూరులో ఉన్నటువంటి పరీక్షా కేంద్రంలో పరీక్షించుకోవచ్చని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు గాను ప్రొద్దుటూరు హైబ్రీడ్ విత్తనాలు, మిని కిట్లను ఉచితంగా ఇవ్వబడుతాయని, ఆసక్తి గల రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించవలసిందిగా తెలియజేశారు.

వాహనాల తనిఖీ



వాహన రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ హుస్సేన్

సుండుపల్లె : బైరాగుట్ట దగ్గర ఎస్‌ఐ హుస్సేన్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులతో ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. వాహన రికార్డులు లేకపోయినా, వాహనాన్ని అతివేగంగా నడిపినా జరిమానా తప్పదని హెచ్చరించారు.

భూ తగాదా విషయంలో కేసు నమోదు

ఒంటిమిట్ట : మండలంలోని నరసన్నగారిపల్లి, తప్పెటవారిపల్లి గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన భూ తగాదాలో జరిగిన దాడికి సంబంధించి బాధితుడి ఫిర్యాదుతో మంగళవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు జూన్ 15వ తేదీన నరసన్నగారిపల్లికి చెందిన భూమిరెడ్డి పుల్లయ్య, తప్పెటవారిపల్లికి చెందిన దున్నూతల గోపిరెడ్డి, గజ్జల ఓబుల్ రెడ్డి పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. వీరి పొలాల మధ్య ఉన్న గెనుము కోసం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో దున్నూతల గోపిరెడ్డి, గజ్జల ఓబుల్ రెడ్డిలు భూమిరెడ్డి పుల్లయ్యపై చేయి చేసుకున్నారు. ఈ ఘటనపై జూన్ 15న బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భూ తగాదా కావడంతో కేసు నమోదు చేయడం కోసం మేజిస్ట్రేట్ అనుమతి కోరామన్నారు. ఎట్టకేలకు మంగళవారం మేజిస్ట్రేట్ అనుమతితో దాడికి పాల్పడిన దున్నూతల గోపిరెడ్డి, గజ్జల ఓబుల్ రెడ్డిలపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలియజేశారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ లాగా మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేయాలని యువజన కాంగ్రెస్ ఆర్టీఐ రాష్ట్ర చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌కి హోదాపై చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కనీసం నోరు విప్పడం లేదన్నారు. ఎందుకు మౌనం వహిస్తున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.